
విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల




**హైదరాబాద్,జూన్11(చట్టం న్యూస్) :** తెలంగాణ ఇంటర్ బోర్డు.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలపై విద్యార్థులకు కీలక అప్‌డేట్ ఇచ్చింది. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇంటర్ మొదటి, రెండో సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల మార్కుల మెమోలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది. విద్యార్థులు తమ ఫలితాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా చెక్ చేసుకోవచ్చు.

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 • సంచిక : 147 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శుక్రవారం 12 జూన్ 2026 • పేజీలు : 8 • వెల 2/-

# పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం

- కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ
- విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్
- వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047'
- నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్11 (చట్టం న్యూస్):** పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



## ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి ఘటన

**కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధృవీకరించిన మంత్రి**

**న్యూఢిల్లీ,జూన్11 (చట్టం న్యూస్):** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిాక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ

మిగతా 2వ పేజీలో..

# డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

- అన్యాయన్ని ప్రశ్నించే వారంతా కాక్రోచ్‌లే
- మయరోమారు విమర్శలు గుప్పించిన జగన్



**అమరావతి,జూన్11 (చట్టం న్యూస్) :** డీఎస్సీ నియామకాల అంశంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మరోసారి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులు యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల యువత నష్టపోతే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మాట్లాడుతూ.. 'ఎవరైనా మమ్మల్ని కాక్రోచ్ పార్టీ అని పిలుస్తారా లేదా అనేది పక్కన పెడితే.. డీఎస్సీ అభ్యర్థులు యువకులు. వారి భవిష్యత్తు, వారి ఉద్యోగ అవకాశాల గురించి మాట్లాడుతున్నాం. వారికి న్యాయం చేయకపోతే ప్రభుత్వం తన బాధ్యతను ఎలా నిర్వర్తించినట్లు అవుతుంది' అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని వైఎస్ జగన్ అన్నారు. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ హక్కుల కోసం గళమెత్తడం సహజమని పేర్కొన్నారు. ప్రస్తుతం తరచూ ప్రస్తావనలోకి వస్తున్న 'జెన్ జీ' యువత కూడా ఈ వ్యవస్థలో భాగమేనని.. వారి ఆశయాలు, ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని వ్యాఖ్యానించారు. 'యువత కలలను, ఆశలను నలిపేస్తే కోట్లాది మంది ప్రజలు ఒకేసారి బయటకు వస్తారు. వారిని ఎవరైనా కాక్రోచ్‌లు అని పిలిస్తే, న్యాయం కోసం పోరాడే వారందరూ కాక్రోచ్‌లే అవుతారు. అలాంటి పోరాటంలో నేను కూడా వారిలో ఒకడిని' అని జగన్ అన్నారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, యువతకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అభ్యర్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని సూచించారు. డీఎస్సీ అవకతవకలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దగా పడ్డ ప్రతి వర్గాన్ని కలుపుకుని ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలపై రాష్ట్రంలో కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

**రాజ్‌కసిరెడ్డి, కారుమూరిల అరెస్ట్ పలుచోట్ల ఇడి ముమ్మర సోదాలు**



**హైదరాబాద్,జూన్11 (చట్టం న్యూస్):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడు పెంచింది. ఏపీ మద్యం స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడు మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అరెస్ట్ చేసింది. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని నివాసంలో కారుమూరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కామ్‌లో విచారణను వేగంతం చేసిన ఈడీ.. గురువారం ఉదయం హైదరాబాద్ నగరవ్యాప్తంగా పదిచోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఇందులో భాగంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసి ఈడీ కార్యాలయానికి తరలించారు. అనంతరం మరో నిందితుడిగా ఉన్న కారుమూరిని అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కెసిరెడ్డి ఇళ్లతోపాటు మరో ఆరుగురి నిందితుల ఇళ్లలో గురువారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఆయన బంధువు

మిగతా 2వ పేజీలో..

## ఎపి నలుగురు రాజ్యసభ అభ్యర్థుల ఏకగ్రీవం

**పోటీలో మరెవరూ లేకపోవడంతో ప్రకటన**

అమరావతి,జూన్11 : ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేసిన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగియడంతో ఎన్నికల సంఘం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభ సభ్యులుగా భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్, లింగమనేని రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. నామినేషన్ల పరిశీలన అనంతరం ఇతర అభ్యర్థులు ఎవరూ పోటీలో లేకపోవడంతో ఎన్నిక అవసరం లేకుండానే వీరి ఎన్నిక ఖరారైంది. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణకు నిర్ణయించిన గడువు ముగియడంతో, మిగిలిన అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు రాజ్యసభ స్థానాలు భర్తీ అయ్యాయి. కొత్తగా ఎన్నికైన సభ్యులు త్వరలోనే రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరి ఎన్నికపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సిబిఎస్‌ఇ ఆన్ స్క్రీనింగ్ లోపాలు

- బయటపెట్టిన 19 ఏళ్ల కుర్రాడు
- ఏకంగా కాన్పూర్ ఐఐటిలో జాబ్

**కాన్పూర్,జూన్11 (చట్టం న్యూస్):** సీబీఎస్ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ లోపాలను బయటపెట్టిన యువతలో 19 ఏళ్ల నిసర్గ అధికారి కూడా ఒకరు. తాజాగా అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సైబర్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ నిసర్గ అధికారిని ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, థ్రెట్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్‌గా నియమిస్తున్నట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. దీనిపై ఈ విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర అగర్వాల్ మాట్లాడుతూ.. 'నిసర్గ అధికారి ఎంతో నైపుణ్యం ఉన్న యువ ఇంజినీర్. అతడికి చిన్న వయసులోనే అద్భుతమైన సాంకేతిక సామర్థ్యాలున్నాయి. ఈ నియామకంతో సైబర్ సెక్యూరిటీ రంగంలో అతడికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. దీంతోపాటు మా విభాగం కూడా బలోపేతం అవుతుందని భావిస్తున్నాం. గతంలోనూ మా సైబర్ విభాగంలో ఇలా యువ ఇంజినీర్లను నియమించుకున్నాం అని వెల్లడించారు. కాంట్రాక్టు విధానంలో అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. అయితే, అతడి వేతనం, ఇతర వివరాలను విద్యాసంస్థ వెల్లడించలేదు.నిసర్గ అధికారి ఈ ఏడాదే 12వ తరగతి పూర్తిచేశాడు. అతడి కుటుంబంలో ఎవరూ సైబర్ సెక్యూరిటీ రంగంలో లేరు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తున్నారు. కోడింగ్ మీదున్న ఆసక్తితో ఆరేళ్ల వయసు నుంచే దాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఆరోతరగతికి వచ్చాక.. సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాడు. 'క్యాప్చర్ ది ఫ్లాగ్' వంటి హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నాడు. ఇటీవల సీబీఎస్ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్‌లో లోపాలను గుర్తించిన నిసర్గ.. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్-ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగింది. తాజా నియామకంపై నిసర్గ మాట్లాడుతూ.. 'ఫుల్‌టైమ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేయడం ఆనందంగా ఉంది. అయితే, వేతనం నేను అనుకున్న దానికంటే తక్కువగానే ఉందని పేర్కొన్నాడు.

# కవిత టిఆర్ఎస్ పార్టీకి చిక్కులు

**పార్టీ గుర్తింపుపై ఇసికి అభ్యంతరాలు**




**న్యూఢిల్లీ,జూన్11 (చట్టం న్యూస్):** ఎమ్మెల్సీ కవిత కొత్త రాజకీయ పార్టీ పేరు చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన' టిఆర్ఎస్ పార్టీకి ఊహించని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పేరుపై ఇప్పటికే పలు అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' కూడా 'టీఆర్ఎస్' అనే పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోలాపూర్‌కు

మిగతా 2వ పేజీలో..

# దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

- విద్య,వైద్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యం
- వెనకబాటు నిర్మూలనకే యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం
- సామాజిక వెనకబాటుకు విద్యలేమి కారణంగా తేలింది
- తెలంగాణ అభివృద్ధి నమూనాపై ప్రత్యేకంగా ప్రస్తావన
- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ ప్రసంగం
- తెలంణాకు ఐఐఎం అసవరాన్ని గుర్తించాలని వినతి
- ప్రధాని మోడీతో ప్రత్యేక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ



**న్యూఢిల్లీ,జూన్11 (చట్టం న్యూస్):** దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డబ్బు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని

మిగతా 2వ పేజీలో..

## ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**మొదటి పేజి తరువాయి..**

మే 13 నుంచి 21 వరకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 889 పరీక్షా కేంద్రాలలో 3,98,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తిచేసిన బోర్డు.. సకాలంలో ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఉపయోగించి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తమ మార్క్స్ మెమోను సులువుగా చెక్ చేసుకోవచ్చు.

## ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి ఘటన

**మొదటి పేజి తరువాయి..**

సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

**మొదటి పేజి తరువాయి..**

పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ 6 ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేంద్రం ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రోఫేజ్-2, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సమావేశానంతరం సిఎం ప్రధాని మోడీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణకు సంబంధించి వివిధ ప్రాజెక్టుల అనుమతులపై చర్చించారు. మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో రెండో దశ తదితర ప్రాజెక్టులపై చర్చించారు.

## కవిత టిఆర్ఎస్ పార్టీకి చిక్కులు

**మొదటి పేజి తరువాయి..**

చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక కవిత పార్టీ పేరుపై భారత్ రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 'టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. టిఆర్ఎస్ పేరును కేటాయించడంపై దాదాపు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే '÷ుఖా' పేరుతో నమోదైన మరికొన్ని రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా టిఆర్ఎస్ పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం కూడా ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో కవిత కొత్త రాజకీయ పార్టీకి 'టీఆర్ఎస్' పేరు దక్కుతుందా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఇడి సోదాలతో జగన్‌లో వణుకు

- **అందుకే డైవర్షన్ పాలిటిక్స్**
- **చింతకాయల విజయ్ విమర్శలు**

అమరావతి,జూన్11 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టిడిపి రాజ్యసభ అభ్యర్థి చింతకాయల విజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడీ అధికారుల సోదాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అసత్య ఆరోపణలతో జగన్ మీడియా ముందుకు వచ్చారని ధ్వజమెత్తారు. జగన్ పీఏ సహా అనుచరగణమంతా ఈడీ సోదాల్లో అడ్డంగా దొరుకుతుండటంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారని ఎద్దేవా చేశారు. గురువారం అమరావతిలో విజయ్ మీడియాతో మాట్లాడారు. ఈడీ సోదాలతో అసలు సూత్రధారి జగన్‌కు వెన్నులో వణుకు మొదలైందని విజయ్ విమర్శించారు. ఈడీ తన దాకా వస్తుందని.. ఆయనకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. కాక్రోచ్‌లు వచ్చేది జగన్ కోసమేనని సెటైర్లు గుప్పించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫాతో ఉండటంతోనే.. గత ఎన్నికల్లో 11సీట్లకు గొడ్డలి పార్టీని ప్రజలు పరిమితం చేశారని విమర్శించారు. వెన్నుపోటు, గొడ్డలి పార్టీ, కోడి కత్తి, డైవర్షన్ రాజకీయాలకు ప్యాంటు, షర్టు వేస్తే అది జగన్‌లాగా ఉంటుందని సెటైర్లు గుప్పించారు. చంద్రబాబు, లోకేశ్‌లు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తామని చెప్పుకొచ్చారు. టీడీపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరుగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి ప్రయోగాలు కొత్త కాదని.. పార్టీ ఐడియాలజీని ముందుకు తీసుకెళ్తామని చింతకాయల విజయ్ పేర్కొన్నారు.

# ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

**మొదటి పేజి తరువాయి..**

నరసింహారెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ దాడులు కొనసాగుతున్నాయి. ఏపీ మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. హవాలా, మనీలాండరింగ్ ద్వారా నిధులు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ క్రమంలో నానక్‌రామ్‌గూడలోని నివాసంలో రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసింది. ఏపీలోని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇల్లు, కార్యాలయంలోనూ సోదాలు కొనసాగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణ జరిపిన ఈడీ అధికారులు.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద అభియోగాలు మోపి, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసులో 33 మందిని నిందితులుగా చేర్చారు. వైకాపా ప్రభుత్వ పెద్దల తరఫున మద్యం కుంభకోణంలో అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, వీరి అనుచరులు బూనేటి చాణక్య, టి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఈడీ చేర్చింది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద మద్యం కుంభకోణం కావటంతో పాటు సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.3,200 కోట్ల ముడుపులను కల్పిత, ఊహాజనిత కంపెనీల ద్వారా వివిధ దశల్లో రూటింగ్ చేసి అంతిమ లబ్దిదారుకు చేర్చినట్లు ప్రాథమికంగా గుర్తించిన ఈడీ.. దర్యాప్తులో మూలాలను వెలికితీస్తోంది.

# పారదర్శకంగానే డిఎస్సీ నిర్వహణ

- పలుమార్లు వివరణ ఇచ్చాం
- **ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టినా పదేపదే విమర్శలు**
- **మరోమారు మీడియాతో కోనశశిధర్ వెల్లడి**

అమరావతి,జూన్11 : డీఎస్సీపై రెండుసార్లు సమగ్ర వివరణ ఇచ్చినా నిరాధార ఆరోపణలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అక్టోబర్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వస్తోందని చెప్పుకొచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. గురువారం కోన శశిధర్ మీడియాతో మాట్లాడారు. లీక్‌కు ఎలాంటి స్కోప్ లేకుండా డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం చేసుకోని వాళ్లే అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కాల్ లెటర్ వచ్చినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్లు కాదని నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేశామని అన్నారు. సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసమే కాల్ లెటర్‌లు పంపిస్తామని వివరించారు.ఎక్కడైనా సెలెక్షన్ లిస్ట్ ఉంటుంది తప్ప రిజెక్షన్ లిస్ట్ ఉండదని చెప్పుకొచ్చారు. ఇంకో డీఎస్సీ కూడా వస్తున్నందున అభ్యర్థులు ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే కమిషనర్ కార్యాలయంలో సమాచారం కోసం అందుబాటులో ఫోన్‌నంబర్ ఉందని, అందరి అనుమానాలు నివృత్తి అవుతాయని కోన శశిధర్ పేర్కొన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా విధానంపై ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎస్సీలో క్రీడా కోటా పారదర్శకంగా అమలు చేశామనటానికి అన్నీ ఆన్‌లైన్‌లో ఉంచామని స్పష్టం చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పకడ్బందీగా డీఎస్సీ పరీక్ష నిర్వహించామని తేల్చిచెప్పారు. 2019లో ఇంటర్ కాలేజ్ రిక్రూట్‌మెంట్ జరిగిందని, కానీ ఇప్పుడలా చేయలేదని వివరించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్, స్టేట్, ఇంటర్నేషనల్, ఒలింపిక్స్ వరకు సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో చూశామని వెల్లడించారు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయని వారికి ఉద్యోగం రాలేదని అన్నారు. అలాంటి వారు కొందరు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం ప్రభుత్వం నడుచుకుంటుందని అజయ్ జైన్ స్పష్టం చేశారు.

# రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు మంగళం

- **ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యంగా ప్రభుత్వం**
- **తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి 1200 కోట్లు దోపిడీ**
- **రైతు పక్షాన తెలంగాణ రక్షణ సేన పోరాటం**
- **నల్లగొండలో రైతు రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత**

**నల్గొండ,జూన్11 :** తరుగు, రవాణా పేరుతో రైతుల వద్ద నుంచి రూ.1200 కోట్లు కప్పం కట్టించుకున్న సిగ్గు లేని ప్రభుత్వం ఇదంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నల్గొండలో రైతు సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. మట్టి తల్లిని అలుసుగా చూస్తూ వ్యవసాయాన్ని కర్మకు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు ఉక్కు సంకల్పం ఉంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు చేయవచ్చని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న సౌకర్యాలు రైతులకు కూడా ఇవ్వాలని ప్రభుత్వానికి ఈ సందర్భంగా కవిత సూచించారు. రైతును రాజు చేసేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని వివరించారు. అన్నదాతల కష్టాలను, వారి గొంతుకను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నల్లగొండను వేదికగా ఎంచుకున్నట్లు టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయంతో పాటు.. రైతుకు గౌరవం ఇవ్వడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె ప్రకటించారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత ధ్వజమెత్తారు. పంట చేతికొచ్చినా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని.. మృగశిర కార్తె ప్రారంభమైనా ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల కాలేదని మండిపడ్డారు. పెట్టుబడుల కోసం అన్నదాతలు మళ్లీ అప్పులు, తాకట్టుల వైపు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు ధాన్యం కొనుగోళ్లలో రవాణా భారాన్ని రైతులపైనే మోపడమే కాకుండా.. క్వింటాకు 6 కిలోల తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు వ్యవసాయ శాఖపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం.. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూడుసార్లు రైతు భరోసాను ఎగ్గొట్టారని, రుణమాఫీ కూడా పూర్తి కాలేదని.. కేవలం ఎన్నికల సమయాన్నే చూసి నిధులు విడుదల చేస్తున్నారని విమర్శించారు. రైతులు పోరాటాలు చేస్తేనే ప్రభుత్వం నిద్ర లేస్తోందని కవిత దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని కవిత ఆరోపించారు. జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని.. మునుగోడు, దేవరకొండ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నల్లగొండకు కూడా నీళ్లు ఇవ్వాలని కోరారు. మరోవైపు అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్న హామీ ఎటు పోయిందని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులే పెద్ద ఎత్తున అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తున్నారని.. ఆ భూముల రక్షణ కోసం రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. 'రైతు డిస్కం' పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని హెచ్చరించారు. తెలంగాణ రక్షణ సేన అనే ఈ కొత్త పార్టీకి, ప్రజల పక్షాన నిలిచే తమ పోరాటానికి ప్రజలందరూ సలహాలు, సూచనలు అందించి మద్దతుగా నిలవాలని కవిత కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో 10 తీర్మానాలు ఆమోదించినట్లు కవిత తెలిపారు. రైతు డిస్కం వద్దని, యూరియా యాప్ తీసేయాలని, బకాయి పడ్డ రైతు భరోసా తక్షణమే అందించాలని, కౌలు రైతులను గుర్తించి వారికి రైతు భరోసా ఇవ్వాలని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని, మూసీ నదిలో కాలుష్యాన్ని నివారించాలని, నిమ్మ, బత్తాయి రైతులకు అండగా నిలవాలని, పత్తి రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలనపి, రైతు సమస్యలపై ఉమ్మడి కార్యాచరణతో భవిష్యత్ ఉద్యమాలు చేయాలని తీర్మానించారు. .

------------

# 'సర్టిఫికెట్ వెరిఫికేషన్' పై కనీస అవగాహన లేని జగన్

### ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

అమరావతి,జూన్11 : పారదర్శకంగా జరిగిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో కూడా వైఎస్ జగన్ గొడ్డలి రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండిపడ్డారు. వైసీపీ నేతలకు 'సర్టిఫికెట్ వెరిఫికేషన్' అంటే ఏమిటో కూడా కనీస అవగాహన లేదని టీడీపీ ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు. వైసీపీ తమ రాజకీయ విద్రోహ కార్యకలాపాల కోసం నిరుద్యోగ యువతను వాడుకుంటోందని విమర్శించారు. గురువారం రాజధాని అమరావతిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. 'నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు' అన్న చందంగా జగన్మోహన్ రెడ్డి ప్రెస్ మీట్ సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఆరోపణను ఆధారాలతో సహా నిరూపిస్తుంటే.. జగన్ కళ్లున్నా చూడలేని కబోదిలా మాట్లాడుతున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. వైసీపీ ముఠా కంటే తీవ్రవాదులు, ఉగ్రవాదులే నయమని.. వారి కంటే దారుణంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది సెప్టెంబర్ 15వ తేదీన అభ్యంతరాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే డీఎస్సీ '÷నైల్ సెలక్షన్ లిస్ట్' విడుదల చేశామని గుర్తు చేశారు. ఎస్‌సీఈఆర్టీ నిపుణుల ప్రత్యేక భద్రత నడుమ మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని వివరించారు. సమాచార వ్యవస్థ లేని రోజుల్లో ఆఫీసుల వద్ద రిజల్ట్స్ నోట్స్ పెట్టే వారని.. కానీ నేడు అంతా ఆన్‌లైన్‌లో స్పష్టంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో దొంగ సర్టిఫికెట్లతో అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర ఉందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి వివరించారు. ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ పోటీల్లో కేవలం పాల్గొన్న వారికి దొంగ సర్టిఫికెట్లతో సచివాలయ ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడ గురించి తెలియకుండా వైఎస్ జగన్ సచివాలయ ఉద్యోగాలు ఇచ్చారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగాల్లో క్రీడాకారులకు న్యాయం చేశానని జగన్ సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఆమోదించిన 65 ఆటల జాబితానే పోర్టల్‌లో ఉంచామని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి వివరించారు. అందులో కూటమి ప్రభుత్వం సొంతంగా చేర్చిన ఆట ఒక్కటి కూడా లేదన్నారు. యాదయ్య అనే క్రీడాకారుడు సరైన సర్టిఫికెట్స్ సమర్పించ లేదు.. ఆ విషయమే అతడు గ్రీవెన్స్‌లో కూడా ఒప్పుకున్నారని వివరించారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న బొంత రోశయ్య అనే వ్యక్తిపై ఫోన్ నెంబర్‌తో సహా ఎఫ్ఐఆర్ నమోదైందని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తెలిపారు. వ్యవస్థలను మేనేజ్ చేసే వైఎస్ జగన్‌కు..7 ఏళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటారనే కనీస చట్ట పరిజ్ఞానం కూడా లేదా? అంటూ వైసీపీ అధినేతను ఆయన ప్రశ్నించారు. దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన జగన్మోహన్ రెడ్డి.. నేడు అవినీతికి వ్యతిరేకంగా పోరాడతాననడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ÷ూజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డీఎస్సీ స్కామ్‌పై చర్చించే దమ్ము వైఎస్ జగన్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. కూనా రవికుమార్, భరత్‌లపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని మొన్ననే వైసీపీకి ఛాలెంజ్ చేశామని గుర్తు చేశారు. దమ్ముంటే ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సవాల్ విసిరారు.

----------

# మేలకుంట శిఖం భూమిని కబ్జా నుండి కాపాడండి

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 11,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ లోని సీతారాంపూర్ శివారులో గల 'మేలకుంట శిఖం' ప్రభుత్వ భూమిని (సర్వే నెం. 71, 72) అక్రమ కబ్జాల నుండి కాపాడి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కరీంనగర్ రెవిన్యూ డివిజన్ అధికారి (=ఐూ) గారికి ఫిర్యాదు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను, ప్రభుత్వ నివేదికలను అధికారులు బేఖాతరు చేయడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

భారీగా ప్రభుత్వ భూమి కబ్జా: సీతారాంపూర్ శివారులోని సర్వే నెం. 71, 72 లో గల 13 ఎకరాల 26 గుంటల మేలకుంట శిఖం ప్రభుత్వ భూమి భారీగా కబ్జాకు గురైంది. తప్పుడు పత్రాలతో మున్సిపాలిటీ నుండి అనుమతులు పొంది ప్రైవేట్ భవనాలు, అపార్ట్మెంట్లు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించారని ఆరోపించారు. నిరూపితమైన అక్రమాలు: తేదీ 22-12-2023 నాడు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చొప్పదండి, కరీంనగర్ రూరల్ సర్వేయర్లతో కూడిన ఉమ్మడి బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. దాదాపు 40 మందికి పైగా అక్రమార్కులు ఇక్కడ నివాసాలు, బేస్మెంట్లు నిర్మించినట్లు ప్రభుత్వ నివేదికే స్పష్టం చేసింది. కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు: రెవెన్యూ అధికారులే ఇవి అక్రమ కట్టడాలని తేల్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా చెరువును, నాలాను కబ్జా చేస్తూ అపార్ట్మెంట్లు, రోడ్ల నిర్మాణాలు నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయి. మునిగిపోతున్న కాలనీలు - ప్రజల ఇబ్బందులు: చెరువు, నాలాలు కబ్జా అవ్వడం వల్ల స్వల్ప వర్షానికే ఆర్టీసీ వర్క్‌షాప్ సమీపంలోని సూర్యనగర్ కాలనీ పూర్తిగా జలమయమవుతోంది. కరీంనగర్ - జగిత్యాల రోడ్డు చెరువును తలపిస్తుండటంతో వాహనాలను దారి మళ్లించాల్సి వస్తోంది.

అధికారులందరికీ తెలిసే ఈ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు ... ఉన్నతాధికారులు స్పందించి ప్రస్తుతం అక్కడ జరుగుతున్న అపార్ట్మెంట్లు, భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలి. అక్రమ కట్టడాలను కూల్చివేసి, మేలకుంట చెరువును, ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు."

-పిర్యాదు చేసిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామెర బద్రి నేత ఉన్నారు






# డ్రగ్స్‌కు నో చెప్పండి.: ఎస్ఐ శివానంద గౌడ్

- యువత మత్తు వదలాలి యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ర్యాలీ
- ప్లకార్డుతో ప్రదర్శన -
- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి
- : డ్రగ్స్ వాడకం వల్ల దీర్ఘకాలిక రోగాలు మెదడుపై ప్రభావం
- ప్రభుత్వ పాత జూనియర్ కళాశాల మైదానం నుండి
- ఏటీఆర్ కన్వెన్షన్ ఫంక్షన్

**హాల్ వరకు ర్యాలీ**

**కొత్తకోట 11 జూన్ 2026 ( చట్టం న్యూస్) :** డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం పట్టణంలోని పాత జూనియర్ కాలేజీకి గ్రౌండ్ నుంచి డ్రగ్స్ కు నో చెప్పండి అనే నినాదంతో సిఐ రాంబాబు ఎస్ఐ శివానంద గౌడ్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మానవ శరీరానికి మెదడుకు తీవ్రమైన హాని కలిగించే రసాయన పదార్థాలు యువత ఇవి తీసుకోవడం వల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుందని వారి ప్రవర్తన మరియు భావోద్వేగాలు మారిపోయి ప్రమాదకర వ్యసనాలకు దారితీస్తాయని తెలిపారు.

కొత్తకోట పట్టణంలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే ప్రధాన నష్టాల గురించి యువతకు చైతన్యం తీసుకురావాలనే ధోరణితో ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు.

ముఖ్యంగా మానసిక సమస్యలు అంటే ప్రెషన్ ఆందోళన మతిస్థిమితం కోల్పోవడం మరియు స్కిజ్ ఆఫ్ ఇండియా లాంటి తీవ్రమైన మానసిక రుగ్మతలు వస్తాయని అలాగే యువతకు శరీరక అవయవాల వైఫల్యం గుండె కొట్టుకునే వేగం పెరుగుతూ గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని కాలేయం మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతింటాయని ప్రతి ఒక్కరు యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటే భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

డ్రగ్స్ లో రకాలు ఇందులో నల్లమందు ( ఓపియం ) గంజాయి కోకాయిన్ హెరాయిన్ వంటి నిషేధిత పదార్థాలు ఉంటాయి.

డ్రగ్స్ వాడకం వల్ల దుష్ప్రభావాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత వారి యొక్క భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దృఢ సంకల్పంతో ఉన్నత విద్యను అభ్యసించి రాబోయే తరాలకు ఆదర్శంగా జీవించాలని ఆయన కోరారు




# నూతన పెన్షన్ లపై అపోహాలు నమ్మకండి

- అసత్య వార్తలు నమ్మవద్దు
- కొత్త పెన్షన్ దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవు
- బిబిఎంపీడీవో అబ్దుల్ సలాం

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం జూన్ 11 చట్టం ప్రతినిధి**

12వ తేదీ నుంచి కొత్త సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారంటూ సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం జరుగుతున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని ఎంపీడీవో అబ్దుల్ సలాం స్పష్టం చేశారు. కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదని ఆయన తెలిపారు. గురువారం ఆయన"ఆంధ్ర ప్రభ" తో మాట్లాడుతూ కొన్ని సోషల్ మీడియా గ్రూపులు, వాట్సాప్ సందేశాల ద్వారా జూన్ 12 నుంచి కొత్త పెన్షన్ దరఖాస్తులు తీసుకుంటున్నారనే తప్పుడు సమాచారం విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో పలువురు ప్రజలు మండల పరిషత్ కార్యాలయం, గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చి ఆరా తీస్తున్నారని చెప్పారు. దీనివల్ల ప్రజలు అనవసరంగా ఇబ్బందులు పడటమే కాకుండా కార్యాలయాల్లో కూడా రద్దీ పెరుగుతోందని పేర్కొన్నారు.



ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వచ్చిన వెంటనే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలు, మండల స్థాయి అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. అప్పటి వరకు ఎవరూ కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు కార్యాలయాల చుట్టూ తిరగవద్దని సూచించారు.

అధికారిక ప్రకటనలు, ప్రభుత్వ ఉత్తర్వులు లేదా సంబంధిత శాఖల ద్వారా వెలువడే సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని, సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను గుడ్డిగా నమ్మవద్దని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా, ప్రజా ప్రతినిధులు మరియు అధికార యంత్రాంగం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని సూచించారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పారదర్శకంగా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభిస్తాం. అప్పటి వరకు వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ఎవరూ ఇబ్బందులు పడవద్దు అని ఎంపీడీవో అబ్దుల్ సలాం స్పష్టం చేశారు.

# బడిబాటలో పీటీఐలు





**కొడిమ్యాల, జూన్ 11(చట్టం) :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మండల కేంద్రంలో విజయవంతంగా కొనసాగుతుంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ ఆధ్వర్యంలో బుధ, గురువారం బడీడు విద్యార్థుల తల్లిదండ్రులను కలవడం జరిగింది. వారికి పాఠశాల బడిబాట కరపత్రం అందజేసి పాఠశాలలోని పలు అంశాలను వివరించి వారి పిల్లలను స్థానిక హైస్కూల్ కు పంపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పుష్కర పాలనకు అభినందన



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం జూన్ 11 చట్టం ప్రతినిధి :** భారత దేశ ప్రధానమంత్రి గౌరవనీయులు నరేంద్ర మోడీ గారి 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా ఆగిరిపల్లి బిజెపి నాయకులు శోభనగిరిపై వేంచేసి ఉన్న దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామికి క్షీరాభిషేకం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు సంగా రంగారావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడీ గారు ఆయురారోగ్యాలతో ఉండి ఈ దేశాన్ని సుభిక్షంగా పరిపాలించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి వాసు మాస్టర్ ,మండల ప్రధాన కార్యదర్శి జలసూత్రం శేషగిరి రావు, ఉపాధ్యక్షుడు రెడ్డి రామారావు, సోషల్ మీడియా మండల ఇన్చార్జి మట్టా సూరిబాబు, పరెడ్డి వేణుగోపాల రెడ్డి పాల్గొన్నారు

# క్రీడలతో భవిష్యత్తుకు బంగారుబాట

- కురవి ఎస్ఐ సతీష్
- భాస్కరసేవాసమితి ఆధ్వర్యంలో క్రీడాకారులకు సన్మానం...

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 11,(చట్టం న్యూస్) వా:** పట్టుదలతో కృషిచేసి క్రీడారంగంలో ఉన్నతస్థాయి ఫలితాలు సాధించినట్లయితే భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవచ్చని కురవి ఎస్ఐ సతీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో భాస్కరసేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ప్రతిభావంతులైన క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భాస్కర సేవాసమితి వ్యవస్థాపకఅధ్యక్షులు, టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.







రాయపూర్ లో జరిగిన ఖేలోఇండియా జాతీయస్థాయి క్రీడోత్సవాలలో 800 మీటర్ల పరుగుపందెం లో విజయం సాధించిన ఇస్లావత్ తండ గ్రామపంచాయతి కి చెందిన బి నందిని,ఈతపోటీల విభాగంలో విజేతగా నిలిచిన రేకులతండ గ్రామపంచాయతీకి చెందిన లిబానోత్ కావేరి లను కురవి ఎస్ఐ సతీష్, భాస్కరసేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ.. సందర్భంగా కురవి ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాపరంగా, విద్యాపరంగా ఎలాంటి అవసరం వచ్చిన మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ పక్షాన తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, మరింత పట్టుదలతో ఆడి జిల్లా కీర్తిని పెంచే విధంగా విజయాలు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ..కార్యక్రమంలో భాస్కరసేవాసమితి గౌరవసలహాదారు కొణతం విజయ్, ఇమామ్, విద్యార్థినుల కుటుంబ సభ్యులు, వారి గ్రామాలకు చెందిన పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జనగణన - 2027 మొదటి దశలో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానం

- రాజన్న సిరిసిల్ల వ్యాప్తంగా జనగణన విజయవంతంగా పూర్తి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /జూన్ 11 ,(చట్టం బ్యూరో) :** జనగణన -2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, ఈ ప్రక్రియలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జనగణన-2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9న ముగిసిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 12 మండలాలు, 2 మున్సిపాలిటీల్లో జనగణన ప్రక్రియ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. 1,126 హౌస్ లిస్టింగ్ బ్లాకులు, 1,025 మంది ఎన్యూమరేటర్లు, 173 మంది సూపర్‌వైజర్లు పాల్గొని, జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకు పైగా జనగణన గృహాలు లెక్కించారని అన్నారు. జనగణన మొదటి దశలో చేపట్టిన గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం, 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్న జనాభా గణనకు ప్రాథమిక ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే మొదటి దశ జనగణనలో భాగంగా వచ్చే నెలలో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన రెవెన్యూ గ్రామాల వారీ మౌలిక సదుపాయాలు, సౌకర్యాలకు సంబంధించిన సమాచారాన్ని గ్రామ స్థాయి అధికారుల ద్వారా సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. జనగణన కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయడంలో సహకరించిన ఛార్జ్ అధికారులు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.




# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**రాయికల్ మే 11 చట్టం :** ప్రభుత్వ పాఠశాలు పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే ముఖ్య కేంద్రాలుగా నిలుస్తున్నాయని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారంపెల్లి ఆంజనేయులు అన్నారు. గురువారం రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి తమ పిల్లలను వీరాపూర్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు ప్రత్యేకంగా అల్పాహారాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు అందరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుంపల నర్సారెడ్డి, నాయకులు దిండిగాల రామస్వామి గౌడ్, ఇస్మాయిల్, అమరెల్లి ఉపాధ్యాయులు నాంపెల్లి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, కారోబార్ ప్రశాంత్, మేట్లు ప్రశాంత్, అనుపాల్, లహరి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



చట్టం సాహితీ లోకం 95814 1999

## కవి విశ్వరూప దర్శనం..!



కలం పట్టిన కవి...
కాలగమనాన్ని
కవిత్వంగా మలుస్తున్నాడు...

హలం పట్టిన రవి...
భూమి గుండెలో బంగారు
భవిష్యత్తును విత్తుతున్నాడు..॥

కవి కల్పనలు చేయడంలేదు
కాలం గర్భంలోని
సత్యాలను తవ్వుతున్నాడు
కవి కవితలు రాయడంలేదు
కవితా శిల్పాలను చెక్కే
శిల్పిగా మారుతున్నాడు..॥

కవి సాహితీయానం చేస్తున్నాడు
సమయసంద్రాలను దాటుతున్నాడు
కవి కాలంతోపాటు నడుస్తున్నాడు
కాలానికే దిక్సూచిగా నిలుస్తున్నాడు..॥

కవి ప్రకృతిని పలకరిస్తున్నాడు
పొద్దుతిరుగుడు పూల
చిరునవ్వులు చదువుతున్నాడు
కవి పంచభూతాలతో
సంభాషిస్తున్నాడు సృష్టి రహస్యాల
సవ్వడులు వింటున్నాడు..॥

కవి విశ్వాన్ని వీక్షిస్తున్నాడు
వెలుగుల వెనుక దాగిన
వాస్తవాలను వెతుకుతున్నాడు
కవి అణవణువులో
అనంతాన్ని శోధిస్తున్నాడు
ఆకాశంలో ఆత్మస్వరాన్ని
అన్వేషిస్తున్నాడు..॥

కవి మనుషుల్ని గమనిస్తున్నాడు
మనసుల మడతల్ని విప్పుతున్నాడు
కవి నవ్వులనొప్పిని చదువుతున్నాడు
కన్నీటి గాథల్ని వినిపిస్తున్నాడు..॥

కవి సమాజ నావకు
చుక్కాని పట్టుకున్నాడు
సమతా తీరాలకు దారి చూపిస్తున్నాడు
కవి చీకటిచెరసాల్లో చిక్కుకున్న వారికి
చైతన్య దీపాలను వెలిగిస్తున్నాడు..॥

కవి బడుగుల వెంట నడుస్తున్నాడు
బానిస సంకెళ్లను తెంచుతున్నాడు
కవి అణగారిన ఆత్మలకు
అక్షర ఆయుధాలనందిస్తున్నాడు
ఆత్మగౌరవ అగ్నిజ్వాలలను
రగిలిస్తున్నాడు..॥

కవి ఆకలిని చూస్తున్నాడు
అన్నపూర్ణ గీతాలను ఆలపిస్తున్నాడు
కవి అన్యాయాలను వీక్షిస్తున్నాడు
అక్షరఖడ్గాలకు పదునుపెడుతున్నాడు..॥

కవి కులాలగోడల మధ్య
నలిగిపోతున్నాడు
తిరుగుబాటు గొడ్డలితో
కూల్చివేయాలన్నాడు
కవి మతాలముసుగుల్ని తీసేసి
మానవత్వపు ముఖాలను
చూపించాలన్నాడు..॥

కవి స్వప్నాలు కనడం లేదు
స్వప్నాలకు స్వరూపమిస్తున్నాడు
కవి భావాలను పలకడం లేదు
బంగారు భవితకు బాటలు
వేస్తున్నాడు..॥

కవి కేవలం రచయిత కాదు
కాలానికి సాక్షి...
కవి కేవలం కలలు కనేవాడు కాదు
కార్యానికి కారకుడు..॥

కవి కేవలం మనిషి కాదు
మౌనానికి భాష...
కవి కేవలం కర్త కాదు
సభ్య సమాజానికి శ్వాస..॥

సమసమాజ నిర్మాణం కోసమే
పుట్టిన కవి...కలం పట్టిన కవి
సమానత్వపు విత్తనాలు చల్లుతున్నాడు
మానవత్వపు మహావృక్షం కోసం
తన జీవితాన్నే నేలగా పరుస్తున్నాడు..॥

రచన: కవిరత్న
సాహిత్యధీర
సహస్ర కవి భూషణ్
గోదావరి కడలి కవిరత్న
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్




## చట్టం సాహితీ లోకం
95814 19999

### అప్పులతో సహవాసం




నిప్పుల కుంపటితో పరిహాసం
అవుతుంది జీవితం అస్తవ్యస్తం
ఉన్నదానితో సరిపెట్టుకోక పోతే
జీవితమంతా అప్పులే నిత్యకృత్యం
లేని దానికోసం అత్యాశ పడకు
అప్పు అన్నది పాము వంటిది
వడ్డీలు కట్టలేక పడాలి ఇక్కట్లు
అన్నీ పోయి వెతుక్కోవాలి ఏదో ఒక చెట్టు
ఆ నోటా ఈ నోటా తెలిసి గుట్టు రట్టు
నీతిగా బ్రతక లేక ఏదో ఒకటి పెట్టాలి తాకట్టు
ఈ అప్పు తీర్చాలని చేస్తావు ఇంకో అప్పు
అప్పుల వాళ్ళు ఆడనివ్వరు నీకు శ్వాస
అబద్ధాలు ఆడటానికి ఏదో ఒక మిస
ఇంట్లో అందరి మీదా కోపంతో రుస రుస
ఎవ్వరికీ ఉండదు నీ మీద జాలీ దయ
తప్పుతుంది జీవితంలో లయ
దర్మరాజు జూదంలో భార్యనే పెట్టాడు ఫణం
ఈ రోజుల్లో ఆన్లైన్ లో ఆటలు ఆడి
ఉన్నది ఊడ్చుకు పోయి అప్పులు చేసి
అప్పు ఇచ్చిన వాడినే ఆడి పోసుకుంటూ
నీతి నియమాలు పాటించని జీవితాలు
తనువునే తాకట్టు పెడుతున్న జాబితాలు
అర్ధభాగాన్ని అంగడి సరుకు చేస్తున్న బ్రతుకులు
దొంగతనాలు చేసే వారు కొందరు
ఈ ఊబిలో పడి తీసుకుంటున్న ప్రాణాలెన్నో
రుణం తీర్చుకుండా చేసే హత్యలు ఫన్నీ
అప్పుకు హత్య తోడై జైలు జీవితం గడిపే ఇంకొందరు
అందుకే అప్పులేని జీవితం అవుతుంది ఎంతో హాయి

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్
శీర్షిక:-అప్పుల వలయం



## చట్టం సాహితీ లోకం
95814 19999

### మానసిక శక్తి




?కంటికి కనిపించని ఒక అద్భుత ఆయుధం,
?గుండె లోతుల్లో దాగున్న అజేయమైన ధైర్యం.
?విధి విసిరే, విసిరిన రాళ్లను సైతం,
?విజయానికి పునాదులుగా మార్చే రసవాదం.

?ఎగసిపడే కెరటం సముద్రాన్ని వీడనట్లు?ఎదురుదెబ్బలు తగిలినా ఆశను వదలకుండా.
?చీకటి రాత్రిని చీల్చుకుంటూ వచ్చే సూర్యుడిలా,
?నిరాశల నడుమ నమ్మకమై ప్రకాశించు.

?కాలి గాయపడినా పరుగు ఆపని అథ్లెట్ లా
?కన్నీళ్లు దాచుకుని పోరాడే యోధుడిలా.
?మట్టిని చీల్చుకుని పైకి లేచే చిన్న విత్తనంలా,
?ఒత్తిళ్ల బరువును మోస్తూనే పైకి ఎదగడంలా.

?పరాజయం ఎదురైతే కుంగిపోవడం కాదు,
?సరికొత్త వ్యూహంతో మళ్లీ అడుగులు వేయడం.
?లోకం నిన్ను చూసి నవ్వుతున్న వేళలో,
?నీపై నీకున్న నమ్మకాన్ని కాపాడుకోవడం.

?శారీరక బలం కేవలం శరీరాన్నే నడిపిస్తుంది,
?మానసిక శక్తి మాత్రమే సామ్రాజ్యాలను నిర్మిస్తుంది.
?మనసును గెలిచిన వాడు జగత్తునే గెలుస్తాడు,
?ఆ సంకల్ప బలమే మనిషిని మహోన్నతుడ్ని చేస్తుంది!

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా




## చట్టం సాహితీ లోకం
95814 19999

### బాల కార్మికులు సమాజ వివక్షత చిహ్నాలు




చిట్టి చేతులు కష్ట పడుతున్నాయి
చిన్న వయసులో బాధలు చూస్తున్నాయి
చెమట చిందిస్తూ సాగుతున్నాయి
అసంఘటిత రంగాలలో
శ్రామిక యంత్రాలుగా నలిగి పోతున్నాయి.
బీదరిక పరిస్థితులు
తల్లిదండ్రుల అవగాహన లోపాలు
ధనం ఆడే ఆటలు
పిల్లల జీవితాలకు శాపాలు.
చదువు లేదు
పోషకాహారం లేదు
ఆటపాటలు లేవు
ఆనంద సంబరాలు లేవు.
కేవలం వ్యవస్థ మార్పుకై
ఆదుకునే ఆపన్నహస్తంకై
మంచి పరిణామాలకై
చట్టాల పటిష్టమైన అమలుకై
ఎదురుచూడటం
ఉన్నత భవితకై
ఆశపడటం
ఆ ద ` ం క ` ం న్న
వ మా ర్గ ద ర్శ్య ల ను
అభినందించడం
నూతన మార్పును
అందుకోవడం
బాల కార్మికుల
దీర్ఘకాలిక లక్ష్యము
వారిని పట్టించుకోవటం సమాజ కర్తవ్యము.

యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.



## చట్టం సాహితీ లోకం
95814 19999

### ఉనికిని కోల్పోరాదు.: జీవులసహజలక్షణం



జీవుల జీవన భాష్యం ఉనికి
ఉనికి తెలుపు తున్నది మానవ గతి
ఉనికి కోసమే ఉర్విలోన యుద్ధాలు
ఒకరికి ఒకరు ఆధిపత్యపు పోరు.

ఉనికి చెబుతున్నది పురోగతి
ఉనికి లేని బతుకు అదో గతి
బాహ్యరూప సౌందర్యం ఉనికి
అంతః సౌందర్యంకోల్పోనిదిమరోఉనికి

మానసిక పరివర్తనే ఉనికి
కాలంచేసినా,కాలగర్భంలో కలసినా చెబుతున్నది ఉనికి.
భావితరాలకు ఉనికి తొలిమెట్టు
ఎందరికో అది ఆయువు పట్టు


మన ప్రవర్తన, ఆత్మ బలము నకు ప్రతీక ఉనికి
ఆశయ సాధనకోసం ప్రతిస్పందనే ఉనికి
ఉన్నత భావాల మానసిక ఆరోగ్య లక్షణం ఉనికి
మానసిక, జీవసంబంధం, సామజిక నిర్మాణం ఉనికి
వివిధ జీవులజీవన అలవాట్లు సామజిక అవసరాలు, సంఘానికి తొడ్పాటు ఇచ్చేదిఉనికి
ఉరుము ఉరిమి పిడుగులుపడినా మారదు ఉనికి
ఉలిదెబ్బలు ఎన్ని తగిలినా కోల్పోదుశిల్పం ఉనికి
పుటములోన ఎంతమరిగినా మారదు పసిడిఉనికి

జీవితాన ఉప్పెన కారాదు ఉనికి
పర్వతమంతస్థిరత్వం ఉంటేనే ఉనికి
ఉదయ బానుడి కిరణవెలుగు ఉనికి
ఎక్కడ, ఎలా ఉన్నా ప్రకాశిస్తుంది ఉనికి.

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
కవి, రచయిత.వి. కోట. చిత్తూరు జిల్లా.
9000169823.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### మాయమైన నైతికత



మానవతకు, మానవ ప్రవర్తనకు సూచిక నైతికత.
నేడు మాయమౌతూ పెరుగుతున్నది దానవత.
మానవజాతి ఉన్నతికి మూలం, అతని విచక్షణ.
సత్యం, ధర్మం, న్యాయం, నిజాయితీ ,ధార్మికతలే ప్రేరణ.
ఇతర జీవుల పట్ల దయ, సానుభూతియే తాదాత్మ్యీకరణ.
ధర్మమే ఆధారంగా నిలిచిన ధరణిపై తాండవిస్తున్న రాక్షసత్వం.
పరుల ఆస్తిపై ఆశ, బాధల పట్ల నిరాసక్తత, మదిలో మోహం
వావి వరుసలు తెలియకుండా మత్తు మింగేసిన దానవత్వం.
ఆడపిల్లలను గౌరవించడం మన సంస్కృతి. వారిని వేధించుట రక్కస నీతి.
నెత్తుటి వరదలలో గెంతులేసే యువత, చెల్లిని, తల్లిని కూడా చంపే రీతి.
విలాసాల కోసం విద్రోహ నీతి. తేలికైన సంపాదన, తేలికగా వ్యయం.

నైతికత లేని వ్యాపారాలు, అవసరాల ప్రాతిపదికన సంబంధాలు.
ఆస్తి కోసం అయినవారిని బలిగొనే తపన. పెరుగుతున్న ద్వేషాలు.
మనకంటూ ఏర్పాటు చేసుకొన్న నియమావళి. తప్పి ప్రవర్తిస్తే ప్రమాదం.
వ్యక్తిగత, సామాజిక నీతికి కట్టుబడి ఉంటే జీవితాన శాశ్వత ప్రమోదం.
సమాజ శాంతికి, మానవ సంబంధాల ప్రగతికి పునాది, నైతికత.
జీవితంలో ఏర్పరచుకున్న ప్రవర్తనా నియమాల మానవ చరిత.
తాను మంచిని మాత్రమే పాటించాలని చూడడం, వ్యక్తిగత నైతికత.
పెద్దల పట్ల గౌరవం, సంస్కృతి, సంప్రదాయాల సామాజిక నైతికత.
వ్యక్తిగత భావనలపై, అంతర్గత చోదనపై ఆధారపడినది, నైతికత.
వృత్తిపరమైన కట్టుబాట్లను సూచించేది ఆయా వ్యక్తులు పాటించే నీతి.
మనిషిని జంతువుల నుండి విభిన్నమైన రీతిలో నడిపించేది, నైతికత.

ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

## చట్టం సాహితీ లోకం
95814 19999

### హృదయ పుష్పం



నీ హృదయమే నీకు గర్భగుడి
నీ హృదయం వికసించిన పుష్పం
అనురాగాల పూదోట హృదయమే
మమకారాల మాధుర్యం చవిచూసినా కొద్ది
పన్నీటి జలకాలలో పసిడి వన్నె మేలిమి పూవు
వేసవి ఎండల్లో వశివాడని దివ్య మాధురి
వడగాలులు ఎన్ని వీచినా తట్టుకోగల దుర్భేద్యం నీ హృదయం
ఆటుపోట్ల జీవితంలో విగతజీవివైతే
లాలనగా జీవం నింపేది నీ హృదయం
బండెడు చాకిరీ చేసి అలసిసొలసిపోతే
సేదదీర్చి నిదురబుచ్చేది నీ హృదయం
నిరంతరం నిన్ను కనిపెట్టుకునేది నీ హృదయం
నీవు తాగుబోతువై తిరుగుబోతువై నీ హృదయంలో అగ్ని రగులుస్తున్నావ్
గుట్కాలు మాదకద్రవ్యాలు సేవిస్తూ నీ గుండెల్లో తూట్లు పొడుస్తున్నావ్
నీ శ్రమలలో నీకు తోడై ఉన్నది నీ కలల పూదోటలో వెన్నెల కురిపించిన నీ హృదయం
నీకై నీవు భోగివై సుఖరోగాల మంటలు రేపుకుంటే
దురాలవాట్లకు బానిసవై మతితప్పిన బికారివైతే
నిన్ను నీ శరీరాన్ని రోగాల రొంపిలోకి ఈడ్చి
తన లబ్ డబ్ శబ్దాల హృదయ లోగిలి కన్నీరిడి ఒక్క క్షణంలో ఆగిపోయి నిన్ను కాటికి సాగనంపేది కూడా అదే హృదయం !
కనుకనే మిత్రమా నీ హృదయాన్ని పసిపిల్లలా కాపాడుకో వెర్రితలలు వేయడం మానుకో,,,,,!!

అపరాజిత్
సూర్యాపేట

## చట్టం సాహితీ లోకం
95814 19999




### " ప్రకృతిని గౌరవిస్తే.. సుకృతి" కోపిస్తే.. వికృతి,విరక్తి,ఉండదు ఆకృతి

-సముద్రంను సాగరం, కడలి,సింధువు, అంభుది, వారథి,ఉదదీ, జలనిధి,అర్ణవం, పయోనిధి అని పిలుస్తారు,
-సముద్రం,విస్తార రూపం,అబ్ది, పారవారం,మున్నీరు అని పిలుస్తారు,
-సముద్రం,మహా సముద్రం,జలాల సమూహం,జల రాశులకు స్థావరం,నివాసం, గూడు,భూమిపై విస్తరించి ఉన్న విశాలమైన ఉప్పునీటి జలరాశి,
-జర్మనీ భాషలో సరస్సు అని,హావ్, మేర్,ఎక్వైర్, ఫాంటస్, పెల్లాగస్, మార్మోర్లకు అర్థం -సముద్రం,
ఒకదానితో ఒకటి అనుసంధానం చేయబడిన సముద్ర జలరాశి,
-హిందూ,నల్ల, కాస్పియన్,ఎడ్రియేటిక్, పెర్షియన్,గల్ఫ్, మధ్యధర, ఎర్ర, సముద్రాలుగా పేర్కొనవచ్చు,
-గ్రీకు పదం తలస్సా అంటే సముద్రం, పిలోస్ అంటే ప్రేమించడం,ఇష్టపడటం దీనినే తల్సోఫైల్ అని అంటారు,
-సముద్రంపై గాఢమైన ప్రేమ ఉన్న వ్యక్తి,
-సముద్ర గర్భం అంటే అడుగు భాగం,సముద్రపు నేల,మహాసముద్ర అడుగు భాగశీ,
-సముద్ర అలలు, ఊర్మి, కెరటాలు తరంగం, లహరి,ప్రకృతి సౌందర్యానికి ప్రతీక,
-సముద్రపు అలలు కలలోనికి వస్తే, ఆడితే,మునిగితే,లేదా తప్పిపోయినా జీవితంలో అనుకూలం, ప్రశాంతత మనకు లభిస్తాయి,
-సముద్రం అల్లకల్లోలం కల వస్తే,చెడు ప్రతికూలతకు అవకాశం,
-కలలో సముద్రపు కెరటాలు సహాయ సహకారం లభిస్తాయి,
-కలలో అలలు, తుఫాను సునామి చూస్తే,ఆర్థిక సంక్షోభం వచ్చే అవకాశం,
-సముద్రంలో ఈత కొట్టినట్లుఅవస్తే,సంతోషంశాంతి,ఆనంద అనుభూతికి అవకాశం,
-ఈత శుభానికి శుభ వార్త,మునిగితే మంచి కల కాదు,సమస్యల వలయం,
-పడవలో ప్రయాణం మంచి అదృష్టం,సమస్యలకు తావు ఇవ్వదు,
-నీళ్లపై నడుస్తుంటే,మంచి కల, ప్రేమ మంచిది,
-సముద్రపు ఒడ్డున అలలు వేస్తే,అశుభం,
-నిర్మలమైన చెరువులు, కాల్వలు దేహ ఆరోగ్యానికి చిహ్నాలు,మురికి నీరు ప్రయత్న కార్యాభంగం,
-శివుడికి అభిషేకం కల,మనశీ ఆ స్థితిలో ఉంటే దోషం ఉండదు,
-దృష్టి,ఆకారం,దృశ్యం లో కలలో ఉంటే మనం స్మృతికి మించి మనసు ఉన్నట్లే,
-సముద్ర అలలు వస్తే స్వప్న దోషం,
-మహా పెనుప్రళయం అస్తవ్యస్థమైన,జీవిత చరిత్రలో విచిత్రం,
-బ్రతుకు భారమై,మనుగడ క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే,సముద్రగర్భం అల్లకల్లోలం అయితే - ఉపరితలంలో ఊహించని ప్రకృతి



వైపరీత్యాలను మనిషి నెదుర్కోవాలి, ఎదుగుదల కష్టం,
-ఒక్క క్షణం ఆలోచిస్తే, ఆగితే,కడలి తండ్రి ఆవేశం,పుడమి తల్లి నిరాశ నిస్పృహలు,ఆక్రందన, కుప్ప కూలిపోయిన భవనాలు,నీటిలో దుర్మరణం,ప్రాణాలు గాలిలో అర్పితం,
-నీతిని,ధర్మం,న్యాయం, మానవత్వాన్ని దైవం ప్రశ్నించక ముందే శాసించిన వేళ,మన క్రియలను వెనుదిరిగి చూసుకో,ప్రకృతిని రంపంతో హింసించిన వైనం, దృశ్యాలు,
-మనం లక్ష్మణరేఖ,గీత దాటకముందే,దైవం పంపిన హెచ్చరికలు, ఆదేశాలు, మార్గదర్శకాలు సమీక్షించుకో, పునరాలోచించి ముందడుగు వేయి,
-ప్రకృతిని ప్రశాంతంగా ఉంచి,లేకుంటే లేదు సుకృతి, జీవితం వికృతి,లేదు ఆకృతి..మిగిలేది తుఫాన్, సునామి, వాయుగుండాలు, అంతర అగ్ని..

- చందు ఆంజనేయులు,విశ్రాంత ప్రాచార్యులు, సామాజిక విశ్లేషకులు,సేవకులు..



## చట్టం సాహితీ లోకం
95814 19999

### మనం కలిస్తే గెలుస్తాం!!




విడివిడిగా మనం ఉంటే
మనం ఓడి పోతాం

కలిసికట్టుగా ఉంటే
అధికారం మనదే

మనలోని లోపాలను సవరించుకుందాం !!

ఐక్యవేదిక
ఏర్పాటు చేసుకుందాం

పంతాలు పట్టింపులు
మనం వదిలి వేద్దాం !

ప్రజా సంక్షేమం కోసం
మనం కలిసి పని చేద్దాం

కుల,మత భేదాలు
ప్రక్కన పెడదాం

అవినీతి నాయకులను
మనం కలిసిఓడిద్దాం

జాతి సమైక్యతను
కలిసి కాపాడుకుందాం

నిరుద్యోగాన్ని
పారద్రోలుదాం

ప్రజా సంక్షేమమే ప్రగతికి
మార్గమని చాటుదాం

ఐక్యతే మన ఆయుధం
సమైక్య తే మన మార్గం

ఆలస్యం చేయకండి
ముందుచూపుతో రండి

ఒంటరి పోరాటం వద్దు
మనం కలిస్తే గెలుస్తాం!!
....................................

రచన సొపాటి ప్రభాకర్
బ్రాహ్మణకోడూరు గ్రామం
సాహితీరత్న, సేవా రత్న,
తెలుగు తేజం నంది అవార్డుల గ్రహీత


# దురంధర్ బాగా నచ్చింది: పవన్ కళ్యాణ్



ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'ధురంధర్'పై ఇప్పటికే సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా దీని ఫ్యాన్స్ లిస్ట్‌లో అగ్ర కథానాయకుడు పవన్ చేరారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'ధురంధర్', 'బారాముల్లా' చిత్రాల గురించి మాట్లాడారు. 'ధురంధర్' మొదటి భాగం తనకు నచ్చిందని పవన్ చెప్పారు. కథను చాలా ధైర్యంగా చూపించారని అన్నారు. దర్శకుడు ఇలాంటి గొప్ప కథను తెరకెక్కించిన విధానం ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా మేకింగ్ స్టైల్ బాగుందని ప్రశంసించారు. తాను బిజీగా ఉండడం వల్ల 'ధురంధర్ 2' చూడలేకపోయినట్లు వెల్లడించారు. ఇక తనకు హారర్ జానర్ సినిమాలంటే ఇష్టమని తెలిపిన పవన్ 'బారాముల్లా' గురించి ప్రస్తావించారు. 1980ల చివర్లో తాను షూటింగ్‌ల కోసం శ్రీనగర్ వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాకు హారర్ సినిమాలు చూడడం అంటే ఆసక్తి. అవి మన మనసును కథలో పూర్తిగా లీనం చేస్తాయి. నాకు నిద్ర రానప్పుడు ఏదైనా హారర్ సినిమా చూస్తాను. కశ్మీర్ నేపథ్యంలో తెరకెక్కిన 'బారాముల్లా' నాకు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. నేను 1987-1989లో షూటింగ్‌ల కోసం కశ్మీర్ వెళ్తుండేవాడిని. అప్పుడే అక్కడ గందరగోళాన్ని స్వయంగా చూశాను. కశ్మీరీ పండిట్లు పడిన బాధలను గమనించాను. ఎవరైనా గెట్‌అవుట్.. ఇక్కడినుంచి వెళ్లిపోండి అంటే నాకు నచ్చదు. దాన్ని భరించడం చాలా కష్టం. బహుశా 'బారాముల్లా'లో ఉన్న ఆ భావోద్వేగమే నాకు సినిమా నచ్చేలా చేసిందేమో' అని చెప్పారు.

# బాలయ్య కొత్త చిత్రం..ఎన్బీకె 111 టీజర్

గాడ్ ఆఫ్ మాసెస్.. ఈ ట్యాగ్ కి అర్హత ఉన్న ఏకైక టాలీవుడ్ నటుడు నందమూరి నటసింహం బాలకృష్ణ మాత్రమే. అసలు మాస్ అంటే బాలయ్య.. బాలయ్య అంటే మాస్. టాలీవుడ్ మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ బాలయ్య. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మాస్ సినిమా అంటే ఎలా ఉంటుందో.. ముద్దుల మావయ్యతో మాస్ హిట్ అందుకున్న బాలయ్య, లారీ డ్రైవర్ తో మాస్ కి పూనకాలు తెప్పించి సమరసింహారెడ్డితో ట్రెండ్ సెట్టర్ మారి గాడ్ ఆఫ్ మాస్ గా మారారు. అప్పటి నుంచి బాలయ్యలోని మాస్ హీరో ఆడియెన్స్‌ను అలరిస్తునే ఉన్నాడు. దర్శకులు బాలయ్య కోసం రాసుకున్న మాస్ కథలు ఎన్నెన్నో. అయితే కొందరు హీరోలకు మాస్ అంటే ఒక లిమిట్ ఉంటుంది. మాస్ సినిమాలు ఇక చాలు బాబు అనేలా ఉంటుంది. కానీ బాలయ్య విషయంలో అలా కాదు. ఇంతకంటే మాస్ ఏం చూపిస్తారులే అనుకునేలోపే.. మాస్ కా బాప్ లాంటి సినిమా చేయడం బాలయ్య స్టైల్. సింహా, లెజెండ్, అఖండ లాంటి సినిమాల్లో బాలయ్యలోని కొత్త మాస్ హీరోని చూపించాడు బోయపాటి. మరి ఇంతకంటే మాస్ ఇంకేం ఉంటుంది అనుకుంటే.. వీరసింహారెడ్డిలో బాలయ్య చేసిన మాస్ తాండవానికి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక డాకు మహారాజ్ అయితే నెక్స్ట్ లెవల్ ఆఫ్ మాస్ మూవీ అని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. డేకేడ్ బెస్ట్ ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే ఇప్పటికి దాకు మహారాజ్ అనే చెప్పాలి. ఇక బాలయ్య వింటేజ్ మాస్ మొత్తం చూపించారులే అనుకునే టైమ్ లో బాలయ్య మాస్ దాహం మాత్రం ఇప్పట్లో తీరేది కాదని సరికొత్త మాస్ ని పరిచయం చేసాడు దర్శకుడు గోపిచంద్ మలినేని. లేటెస్ట్‌గా వచ్చిన ఎన్బీకె 111 టీజర్ చూస్తే.. ఈ విషయం అర్థమవుతుంది. ఈసారి వింటేజ్ బాలయ్యను కాకుండా.. న్యూ ఏజ్ బాలయ్యను చూపించాడు. ఈ టీజర్ చూస్తే.. స్టైలిష్ లుక్‌తో బాలకృష్ణ మాస్‌ను 'జెన్-జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నాడు గోపీచంద్. దానికి తోడు.. బాలయ్య అంటే ఊగిపోయే తమన్, మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పూనకాలు తెప్పించాడు. ఏదేమైనా.. గాడ్ ఆఫ్ మాసెస్ అంటే ఆ మాత్రం ఉంటది మరి!







# సింగీతం.. దర్శక భీష్మాచార్యులు

### సింగ్ గీతం విజయం సాధించాలన్న చిరంజీవి

తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు భీష్మాచార్యుడని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'సింగ్ గీతం' . నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించారు. జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. సింగీతం శ్రీనివాసరావు.. తెలుగు సినిమా పరిశ్రమకు ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో రూపొందిన 'సింగ్ గీతం' ఈనెల 12న విడుదల కానుంది. ఇది ఇండియన్ సినిమాలో మరొక మైలురాయిగా నిలవాలని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్తతరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఒకవైపు ఆనాటితరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం మరోవైపు ఈతరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్.. వీరి కాంబో ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇందులోభాగమైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సింగ్‌గీతం'. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే కథ. కొన్ని అనూహ్య పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థుల గందరగోళాన్ని.. తమ వింత పరిస్థితికి సమాధానం వెతికే ప్రయత్నాల్ని ఇందులో వినోదాత్మకంగా ఆవిష్కరించారు. ఇలాంటి సీనియర్ దర్శకులను గౌరవిస్తూ, వారి అపారమైన అనుభవాన్ని కొత్త తరానికి అందించాలనే అద్భుతమైన ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ నిర్మాత నాగ్ అశ్విన్‌ను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు.



# మీరే నా సర్వస్వం..సర్

### భారతీరాజాను తలచకుంటూ రాధిక ఉద్వేగం

దిగ్గజ దర్శకుడు భారతీరాజా తో నటి రాధికకు విడదీయరాని అనుబంధం ఉంది. భారతీరాజాను తన గురువుగా భావించే రాధిక సందర్భం వచ్చినప్పుడల్లా ఆయనపై ఉన్న అభిమానాన్ని వెల్లడిస్తూనే ఉంటారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానంటూ తాజాగా వరుస పోస్ట్‌లు పెట్టారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'మీరే నా సర్వస్వం..' అని రాసుకొచ్చారు. ఆయన లేరని తెలిసి తన హృదయం ముక్కలైందన్నారు. నన్ను తీర్చిదిద్దిన వ్యక్తులు ఇద్దరు. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం వాళ్లే. ఒకరు నా తల్లి, మరొకరు నా గురువు భారతీరాజా. ఒక్క ఏడాదిలోనే వీళ్లిద్దరినీ నేను కోల్పోయాను. ఈ వేదనను మాటల్లో వివరించలేకపోతున్నాను. ఏం చెప్పాలో కూడా అర్థం కావడం లేదు. హృదయం బరువెక్కింది. నా బాధను అర్థం చేసుకుని, నాతో పాటు నిలబడి, అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ నేను తలవంచి నమస్కరిస్తున్నాను. వారి జ్ఞాపకాలు, వారు నాకు నేర్పిన జీవిత పాఠాలు నాతో ప్రయాణిస్తూనే ఉంటాయని రాసుకొచ్చారు. ఇక సినీ వేడుకల్లో భారతీరాజా అంటే తనకు ఎంత ఇష్టమో చెప్పిన వీడియోను ఆమె పంచుకున్నారు. 'భారతీరాజా సర్.. మీరే నా సర్వసం. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అని క్యాప్షన్ పెట్టారు. రాధికను ఇండస్ట్రీకి పరిచయం చేసింది భారతీరాజానే. 1977లో వచ్చిన తమిళ మూవీ '16 వయథినిలే'తో దర్శకుడిగా మారిన ఆయన తన రెండో సినిమా 'కిళక్కే పోగమ్ రైల్'తో రాధికను నటిగా కోలీవుడ్‌కు పరిచయం చేశారు. ఆ సినిమా హిట్ కావడంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ఆమెను స్టార్ హీరోయిన్‌గా తీర్చిదిద్దిన గురువుగా భారతీరాజాపై రాధికకు అపారమైన గౌరవం ఉంది. ఆయన కూడా తన విజయాల్లో రాధిక భాగమని ఎప్పుడూ చెప్పేవారు. ఇటీవల కూడా రాధిక ఆయన్ని కలవగా.. ఆమె నటించిన 'తాయ్‌కిళవి'కి నేషనల్ అవార్డు వస్తుందని



ప్రోత్సహించారు. 'వస్తే మీ పాదాల దగ్గర పెడతాను' అని ఆమె తన గురువుపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం రాధిక షేర్ చేసిన పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.


# భారతీరాజా మృతికి మోడీ సంతాపం

ప్రముఖ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా మరణం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా రంగంలో, ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో ఆయన ఒక దిగ్గజమని, తన అద్భుతమైన సృజనాత్మకతతో తమిళ సినిమా గమనాన్నే మార్చేశారని ప్రధాని కొనియాడారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో సంతాప సందేశాన్ని పంచుకున్నారు. భారతీరాజా గ్రామీణ జీవనాన్ని, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతమని, అది ఎప్పటికీ ప్రశంసనీయంగా నిలిచిపోతుందని మోదీ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఓం శాంతి అంటూ ప్రధాని నివాళులర్పించారు.



# ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్

న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷-టకెస్గ్రా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ఫ్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ- రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷-లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.



# మరో లవ్ స్టోరీ దివానా

హర్షిత్, స్నేహ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'దీవాన' శ్రీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈసినిమా జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'చచ్చేంత ప్రేమ లేకపోతే అది లవ్వే కాదు..', 'ఎంతగొప్ప లవ్‌స్టోరీ అయినా..వన్‌సైడ్ లవ్‌తోనే మొదలవుతుంది' అనే డైలాగులు యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి.



# చట్టం స్పోర్ట్స్

## పసికూన చేతిలో ఘోరంగా ఓడిన పాకిస్తాన్..

ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్-2026 ప్రధాన టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ మహిళల జట్టుకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మంగళవారం డెర్బీలోని కౌంటీ గ్రౌండ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన తన రెండవ, చివరి వార్మప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 41 పరుగుల తేడాతో (డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం) పరాజయం పాలైంది. వర్షం కారణంగా నిలిచిపోయిన ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ అద్భుత ప్రదర్శనతో పాక్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట స్కాట్లాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్కాట్లాండ్ ఓపెనర్ డార్సీ కార్టర్ (36 బంతుల్లో 45 పరుగులు) జట్టుకు బలమైన ఇన్నింగ్స్ అందించింది. ఆమె మరో ఓపెనర్ కేథరిన్ ఫ్రేజర్ (19)తో కలిసి మొదటి వికెట్‌కు 6 ఓవర్లలోనే 41 పరుగులు జోడించింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్కాట్లాండ్ కెప్టెన్ కేథరిన్ బ్రైస్ మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించింది. కేవలం 43 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి తృప్తిగా సెంచరీ చేజార్చుకుంది. ఆమె మెరుపు ఇన్నింగ్స్ కారణంగా స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 191 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీసినప్పటికీ, ఫీల్డర్ల పేలవమైన ప్రదర్శన కారణంగా బ్రైస్‌ను అడ్డుకోలేకపోయారు. ఇన్నింగ్స్ చివరి బంతికి ఆమె రనౌట్ అయింది. 192 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ మహిళల జట్టు ఆరంభంలోనే చేతులెత్తేసింది. మొదటి ఐదు ఓవర్లలోనే గుల్ ఫెరోజా, సైరా జబీన్, ఆయేషా జాఫర్ వంటి కీలక వికెట్లను కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. స్కాట్లాండ్ బౌలర్ రాచెల్ స్లేటర్ తన రెండు ఓవర్లలోనే రెండు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. 9 ఓవర్లు ముగిసేసరికి పాకిస్తాన్ 62 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో హఠాత్తుగా కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేసి, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం స్కాట్లాండ్‌ను 41 పరుగుల తేడాతో విజేతగా ప్రకటించారు. తమ మొదటి వార్మప్ మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో 9 వికెట్ల తేడాతో ఓడిపోయిన పాకిస్తాన్‌కు, ఇది వరుసగా రెండవ పరాజయం. ఈ ఆదివారం (జూన్ 14న) ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సాంప్రదాయ ప్రత్యర్థి భారత్‌తో జరగబోయే తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ మ్యాచ్‌కు ముందు ఈ వరుస ఓటములు పాక్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. మరోవైపు, ఉత్సాహంలో ఉన్న స్కాట్లాండ్ జట్టు జూన్ 13న ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ ప్రపంచకప్ టోర్నీలో గ్రూప్-ఎ లో భారత్, పాకిస్తాన్‌లతో పాటు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బి లో ఆతిథ్య ఇంగ్లాండ్, డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజీలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, స్కాట్లాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. కాగా, ఈ మెగా టోర్నమెంట్ శుక్రవారం బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్-శ్రీలంక మ్యాచ్‌తో అధికారికంగా ప్రారంభం కానుంది.

## గంభీర్‌ను బైపాస్ చేసిన ఆటగాళ్లు!



వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోంది. భారత్-అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్?తోనే ఈ సన్నాహాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఈ లోపే భారత్ జట్టులో సర్దుబాటు చేయాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్?పై చర్చలు జోరుగా నడుస్తున్నాయి. వాళ్లు వచ్చే వన్డే ప్రపంచ కప్? వరకు ఉంటారా? లేదా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్?గా మారింది. టెస్టులు, టీ20 ఫార్మాట్లలో అత్యంత పట్టున్న వ్యూహకర్తగా గౌతమ్? గంభీర్? పేరుతెచ్చుకున్నాడు. కానీ వన్డే క్రికెట్?కు సంబంధించి ఆ స్థాయి పట్టు అతడు సంపాదించలేకపోయాడని టాక్. ముఖ్యంగా వన్డే టీమ్?లోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ ఆటగాళ్లతో గంభీర్?కు సరైన సమన్వయం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే జట్టులోని ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు గంభీర్?ను పక్కన పెట్టి (బైపాస్ చేసి) 2027 వన్డే ప్రపంచకప్? నాటికి తమ భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంపై స్పష్టత కోసం నేరుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పెద్దలను ఆశ్రయించినట్లు సమాచారం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్? అయినప్పటి నుంచి, వాళ్లిద్దరూ 2027 వన్డే ప్రపంచకప్?లో ఆడతారా? లేదా? వారి భవిష్యత్ ప్లాన్స్? ఏంటి అనే అంశాలు తెరపైకి వచ్చాయి. అయితే గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న విధానాలు, అలాగే సెలక్షన్ కమిటీ డిమాండ్లు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, రాయల్? ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్?సీబీ) తరఫున ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్?) 2026 సీజన్? ఆడిన విరాట్? కోహ్లీ ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. తాను మంచి క్రికెటర్ అని మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పాడు. ఇక రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడు ఇప్పుడు వన్డే వరల్డ్ కప్? విషయంలో భిన్నమైన విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రముఖ వార్తాపత్రిక నివేదిక ప్రకారం, గౌతమ్ గంభీర్? నేతృత్వంలోని టీం మేనేజ్?మెంట్?కు, కొందరు సీనియర్ ఆటగాళ్లకు మధ్య పూర్తిస్థాయి అవగాహన కుదరలేదు. ప్రస్తుతానికి ఆ సీనియర్ ఆటగాళ్లు తమ భవిష్యత్తుపై నేరుగా బీసీసీఐ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పరిణామం అటు కోచ్? గంభీర్?ను, ఇటు సెలక్షన్ కమిటీ ఛైర్మన్? అజిత్ అగార్కర్?ను ఇరకాటంలో పడేసింది. "జట్టులో విరాట్?, రోహిత్ లాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నప్పుడు, డ్రెస్సింగ్ రూమ్?లో కెప్టెన్? శుభ్?మన్? గిల్?కు మరింత బలమైన పట్టు ఉండాలి. అయితే టెస్ట్, టీ20 ఫార్మాట్లలో చూపించినంత శ్రద్ధ గంభీర్ వన్డేలపై చూపించడం లేదు. ఇప్పటి వరకు ఆయన వన్డే మ్యాచులు, సిరీస్?ల్లో ఏం జరిగినా వాటి మానాన వాటిని సాగిపోనిచ్చారు" అని బీసీసీఐకు చెందిన ఒక అధికారి తెలిపారు. "ఇప్పుడు దృష్టి అంతా వన్డే ప్రపంచకప్ సన్నాహాలపైకి మళ్లింది. అందుకే గంభీర్?, గిల్? బాధ్యతలు తీసుకొని, తమ ఆలోచనలను డ్రెస్సింగ్ రూమ్?లో స్పష్టంగా చెప్పే అవకాశం ఉంది. ఇన్నేళ్లుగా భారత్ జట్టుకు ఎనలేని సేవలు అందించిన సీనియర్ ఆటగాళ్ల నుంచి జట్టు ఇప్పుడు ఏం ఆశిస్తోందో సూటిగా చెప్పాలి. అలాగే రానున్న 16 నెలల ప్రణాళిక ఏంటి అనేది స్పష్టంగా వివరించాలి. ఇదే ముఖ్యం" అని సదరు బీసీసీఐ అధికారి తెలిపారు. "2026 నవంబర్ నాటికి విరాట్ కోహ్లీకి 38 ఏళ్లు నిండుతాయి. రోహిత్ శర్మ ఇప్పటికే 39 ఏళ్లకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో వన్డే ప్రపంచకప్? జట్టులో వారు ఉంటారా? ఒక వేళ ఉంటే జట్టులో వారి స్థానం ఏమిటి అనే ప్రశ్నలు చెలరేగుతున్నాయి. ఈ పరిస్థితిని గంభీర్, గిల్? ఎలా సమన్వయం చేసుకుంటారనే దానిపై భారతదేశ ప్రపంచకప్ కలలు ఆధారపడి ఉంటాయి" అని సదరు బీసీసీఐ అధికారి పేర్కొన్నారు.

## వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభావంతుడు

### సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ ప్రశంసలు

భారత క్రికెట్ రంగంలో సరికొత్త సంచలనం 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాడు. ఐపీఎల్ సీజన్ లో దాదాపు 800 పరుగులు సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకున్న ఆటగాడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. అతని అసాధారణ ప్రదర్శన చూసిన సెలక్టర్లు.. ఏరికోరి అతడిని భారత జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. దీని ద్వారా పురుషుల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే టీమిండియా పిలుపు అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్ర పుటల్లోకెక్కాడు. కేవలం ఐపీఎల్ మాత్రమే కాదు.. వైభవ్ సూర్యవంశీ వయసు విభాగాల క్రికెట్ లో, దేశీవాళీ (డొమెస్టిక్) సర్క్యూట్ లో, జూనియర్ అంతర్జాతీయ క్రికెట్ లోనూ రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. ఇటీవల భారత్ సాధించిన అండర్-19 ప్రపంచకప్ విజయంలోనూ అతను కీలక పాత్ర పోషించాడు. పరిమిత ఓవర్ల (లిమిటెడ్ ఓవర్స్) క్రికెట్ లో తన అపారమైన ప్రతిభను ఇప్పటికే నిరూపించుకున్న ఈ యువ సంచలనం.. భవిష్యత్తులో రెడ్-బాల్ (టెస్ట్) క్రికెట్ లో కూడా ఇదే రీతిన రాణించగలడా? అసలు అతనికి టెస్ట్ క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉందా? అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అన్ని



ఫార్మాట్లలో అత్యుత్తమ బ్యాటర్‌గా పేరొందిన సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్.. వైభవ్ సూర్యవంశీని "అద్భుతమైన ప్రతిభావంతుడు" అని కొనియాడారు. అయితే అతను టెస్ట్ క్రికెట్ వైపు అడుగులు వేస్తాడా లేదా అనేదానిపై ఆదివారం ఒక ఇంటర్వ్యూలో డివిలియర్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు."అవును, అతను అద్భుతమైన టాలెంట్. కానీ రెడ్-బాల్ క్రికెట్ గురించి నేను కచ్చితంగా సమాధానం చెప్పలేను. అతను అనుకుంటే టెస్ట్ క్రికెట్ ఆడగలడు, కానీ ఇక్కడే పెద్ద ప్రశ్న వస్తుంది.. అతనికి నిజంగానే టెస్ట్ క్రికెట్ ఆడాలని ఉందా? దానికి కాలమే సమాధానం చెబుతుంది. అతనికి ఆ సామర్థ్యం, ప్రతిభ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే టెస్ట్ క్రికెట్ అంత సులువు కాదు, కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. నా అభిప్రాయం ప్రకారం అతను టెస్ట్ క్రికెట్ ఆడాలని నేను కోరుకుంటున్నాను, కానీ ఆడతాడా అనేది అనుమానమే. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం" అని డివిలియర్స్ వ్యాఖ్యానించారు. ఇంత చిన్న వయసులోనే వైభవ్‌కు భారత జట్టులో చోటు కల్పించాలనే సెలక్టర్ల నిర్ణయాన్ని డివిలియర్స్ పూర్తిగా సమర్థించారు. "సెలక్టర్లు ఖచ్చితంగా సరైన నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి ధైర్యమైన నిర్ణయం తీసుకున్నందుకు వారికి అభినందనలు. అతను ఇంకా చాలా చిన్నవాడని, అనుభవం లేదని పక్కన పెట్టడం చాలా సులువు. కానీ వైభవ్ తన ప్రతిభతో ఆ తలుపులు బద్దలు కొట్టాడు. భారత టీ20 జట్టులో స్థానానికి అతను పూర్తి అర్హుడు. అతని పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని ఏబీ డివిలియర్స్ పేర్కొన్నారు.

## మైదానంలో తీవ్ర వాగ్వాదం

### ఇంగ్లిస్‌ను రెచ్చగొట్టిన నహిద్ రాణా



ఢాకా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా, ఆసీస్ కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఇంగ్లిస్ (19) వికెట్ తీసిన రాణా, అతని ముందే రెచ్చగొట్టేలా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. అదే సమయంలో ఏదో అనడంతో ఇంగ్లిస్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ వెనక్కి తిరిగి గొడవకు దిగిన ఇంగ్లిస్‌ను బంగ్లాదేశ్ ఆటగాళ్లు సముదాయించి పంపించారు. బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా మధ్య ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ఓ ఆసక్తికర ఘటన జరిగింది. ఈ మ్యాచులో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా , ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో జోష్ ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత వివాదం చెలరేగింది. నహిద్ రాణా సెలబ్రేషన్స్ ఇంగ్లిస్‌కు కోపం తెప్పించాయి. దీంతో మైదానంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు బంగ్లాదేశ్ ప్లేయర్లు సముదాయించడంతో వివాదం సద్దు మణిగింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. 284/8 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తొలి 8 బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. ఆదుకునే ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్.. 51/2తో నిలిచింది. అప్పటికే ఇంగ్లిస్ 19 రన్స్ చేశాడు. అయితే 11వ ఓవర్ వేసేందుకు నహిద్ రాణా వచ్చాడు. స్ట్రైకింగ్‌లో ఇంగ్లిస్ ఉన్నాడు. రాణా వేసిన బంతిని షాట్ ఆడబోయిన ఇంగ్లిస్.. వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. బ్యాట్ బంతిని తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ చేతిలో పడటంతో ఔట్ అయ్యాడు. దీంతో నహిద్.. సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇంగ్లిస్ ముందే తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత నహిద్.. ఏదో అనగా ఇంగ్లిస్ కోపోద్రిక్తుడైపోయాడు. పెవిలియన్‌కు వెళ్లిపోతున్న అతడు.. వెనక్కి తిరిగి గొడవకు దిగాడు. కానీ అక్కడే ఉన్న బంగ్లాదేశ్ ప్లేయర్లు.. జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇంగ్లిస్ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మ్యాచులో ఆస్ట్రేలియా 86 పరుగుల(డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) తేడాతో పరాజయం పాలైంది. దీంతో బంగ్లాదేశ్ చేతిలో 21 ఏళ్ల తర్వాత వన్డే మ్యాచులో ఓడిపోయింది. 2005లో రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు సైతం బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయింది.

## ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరం

ఇండియా క్రికెట్ ఫ్యాన్స్‌కు ఒకేసారి గుడ్ న్యూస్, బ్యాడ్ న్యూస్ వచ్చాయి. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీమిండియా సీనియర్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా జట్టులోకి తిరిగి రానున్నారు. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వహించిన ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌లో వీరిద్దరూ సక్సెస్‌ఫుల్‌గా పాస్ అయినట్లు ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. ఐపిఎల్ 2026 సీజన్ లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నప్పుడు రోహిత్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో, హార్దిక్ బ్యాక్ స్పాజమ్స్ సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంతో త్వరలోనే వీరు నేషనల్ స్క్వాడ్‌తో కలవనున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హ్యామ్‌స్ట్రింగ్ ఇంజూరీ కారణంగా ఈ వన్డే సిరీస్ నుంచి కంప్లీట్‌గా రూల్ అవుట్ అయ్యాడు. ఐపిఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ డిఫెండ్ చేసుకున్న టైంలో కోహ్లీకి ఈ గాయమైంది. కోహ్లీ రికవరీ టైమ్‌లైన్‌పై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అప్‌డేట్ ఇచ్చాడు. గాయం జరిగి ఇంకా వారం కూడా కాలేదని, ఫిజియోలు పరిశీలిస్తున్నారని చెప్పాడు. ఇంగ్లాండ్ వన్డే సిరీస్ నాటికి కోహ్లీ ఫిట్ అయ్యే ఛాన్స్ ఉన్నప్పటికీ, అది కచ్చితమైన సమాధానం కాదని అగార్కర్ స్పష్టం చేశాడు. కోహ్లీ ప్లేస్‌లో యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను వన్డే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జూన్ 13 నుంచి వన్డే సిరీస్ స్టార్ట్ కానుంది. మొదటి వన్డే జూన్ 13న ధర్మశాలలో జరుగుతుంది. రెండో వన్డే జూన్ 17న లక్నోలో, చివరి వన్డే మ్యాచ్ జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చూసుకోనున్నాడు. కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఉన్నారు. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఈ వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు.



## కమీషన్ దొబ్బుతూనే విమర్శలా?

### సునీల్ గవాస్కర్ ఆగ్రహం

ఐపీఎల్ టోర్నీపై విమర్శలు గుప్పిస్తున్న విదేశీ మాజీ క్రికెటర్లు, క్రికెట్ బోర్డులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీసీఐ నుంచి 10 శాతం కమీషన్ దొబ్బుతూనే టోర్నీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తమ ప్రయోజనాల కోసం భారత క్రికెట్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఆయన హితవు పలికారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పూర్తి స్థాయిలో ఆడిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ కంటే ఐపీఎల్ వంటి లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు మాజీ క్రికెటర్లు ఆర్చర్‌పై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ టోర్నీని తప్పుబట్టారు. ఫ్రాంచైజీ లీగ్స్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముప్పు పొంచి ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. 'టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచివే. కానీ అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కంటే వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుంది' అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ సైమన్ డౌల్ సైతం ఆర్చర్ తీరును తప్పుబట్టాడు. డబ్బుల కోసం దేశం తరఫున జరిగే మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం సరికాదని విమర్శించాడు. గతంలో ట్రెంట్ బౌల్ట్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సమయాల్లోనూ టెస్ట్‌ల కోసం సిద్ధమయ్యేవారని గుర్తు చేశాడు. ఈ మాజీ ఆటగాళ్ల విమర్శలను సునీల్ గవాస్కర్ ఖండించారు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించడం కొందరు విదేశీ ఆటగాళ్లకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు ఇచ్చే వేతనంలో 10 శాతం వాటాను బీసీసీఐ నేరుగా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు చెల్లిస్తోందని ఆయన గుర్తు చేశారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లీగ్‌లు ఇలాంటి పద్ధతిని పాటించడం లేదని ఆయన ఎత్తిచూపారు. మిలియన్ల పౌండ్లను బీసీసీఐ నుంచి పొందుతున్న బోర్డులే.. ఇప్పుడు ఐపీఎల్‌ను తక్కువ చేసి మాట్లాడటం వారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనమని గవాస్కర్ మండిపడ్డారు. 'భారత క్రికెట్, ఇక్కడి అభిమానుల సొమ్ముతో విదేశీ బోర్డులు తమ ఖజానాను నింపుకుంటున్నాయి. ఆ విషయాన్ని మరిచిపోయి ఐపీఎల్‌ను ద్వేషించడం విడ్డూరంగా ఉంది. భారత క్రికెట్‌ను ఎంతగా తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసినా.. ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికైనా విమర్శకులు వాస్తవాలను గుర్తించాలి.' అని గవాస్కర్ చురకలంటించారు.



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999